క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



లబ్ధిదారుకు వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని వాడపర్రుకు చెందిన కండేపల్లి దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా వచ్చిన రూ.10 వేలను దుర్గారావు భార్య లక్ష్మికి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొంగ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సచివాల కన్వీనర్ పోలిశెట్టి వీరబాబు, జొన్నాడ చిన్న, దేవరపల్లి రాంబాబు, కార్యదర్శి పరమట సాయిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ బి.శ్రవణ్‌వర్మ, వలంటీర్ మడక అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా గోరక్షా దీక్షా యాగం



గోరక్షా దీక్షా యాగంలో పాల్గొన్న భక్తులు

యానాం: పర్యావరణ పరిరక్షణకోసం కోటి గో కరీష(ఆవుపేడ పిడకలు) మహాయజ్ఞంలో భాగంగా ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన శ్రీసురభి గోరక్ష దీక్షాయాగం విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కుందర్తి మహీకిరణ్‌శర్మ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో జరిగిన దీక్షా యాగానికి యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనం అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గోమయ గౌరీవ్రతం, గోవింద నామావళి హోమం, రాహు కాల దీపారాధన, మహీ వరాహ హోమం నిర్వహించారు. ఆఖరి రోజు శనివారం గోగ్రహ నక్షత్ర శాంతి హోమం జరిపారు.

వైద్య కోసం ఆర్థిక సాయం



సత్యశ్రీ కుటుంబీకులకు రూ.20 వేలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: కిడ్నీ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితురాలికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయం చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని చొల్లంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి సత్యశ్రీకి వైద్యం నిమిత్తం ఆమె కుటుంబీకులకు శివన్నారాయణ రూ.20 వేల నగదును అందజేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గంజా కాశీ విశ్వనాథ్, గోవిందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష రుద్రాక్ష పూజ



లక్ష రుద్రాక్ష పూజ సందర్భంగా కురంగేశ్వరస్వామి

తాళ్లరేవు: మండలంలోని పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర మాస శివరాత్రి, శని త్రయోదశి, ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

18న వర్కింగ్ డేగా నిర్ణయం

యానాం: దీపావళి ఆదివారం రావడంతో దానిని పురస్కరించుకుని ఈ నెల 13న పుదుచ్చేరి ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో దానికి బదులుగా ఈ నెల 18న శనివారం వర్కింగ్ డేగా నిర్ణయించినట్లు కార్యదర్శి కిరణ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలలకు, కళాశాలలకు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు వర్తిస్తుందన్నారు.

చిన్నారులకు టపాసుల కిట్లు అందజేత

అమలాపురం టౌన్: స్థానిక పిండి తిరుపయ్య నాయుడు, నాగరత్నామణి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు దీపావళి సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు టపాసుల కిట్లు శనివారం పంపిణీ చేశారు. స్థానిక కల్వకొలనువీధిలో ట్రస్ట్ అధ్యక్షుడు పిండి శేషుబాబు చేతుల మీదుగా పేదింటి చిన్నారులకు ఈ కిట్లను అందజేశారు. ప్రతీ దీపావళికి ట్రస్ట్ ద్వారా తమ వంతుగా కొంతమంది పిల్లలకు టపాసుల కిట్లు అందజేస్తున్నామన్నారు.

విద్యా సంస్కరణకు ఆద్యుడు ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో సత్తిబాబు తదితరులు



అమలాపురంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఖాదర్, బులినాని తదితరులు



అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

సాక్షి, అమలాపురం: భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చాలా చురుకైన పాత్ర పోషించారని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారికంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి డీఆర్వో, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ముస్లిం మత పెద్దలు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో సత్తిబాబు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. హిందూ ముస్లిం మతాల శాంతియుత సహజీవనం చేసే ఏకీకృత స్వాతంత్య్ర భారత దేశం ఆయన కల అన్నారు. రాజ్యాంగ రూపకల్పన, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్షలు అనుభవించారన్నారు. వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ స్వాతంత్య్ర పోరాటంలో అత్యంత ప్రభావవంతమైన స్వాతంత్య్ర ఉద్యమకారులలో ఒకరన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, కలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నో విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టి విద్యార్థుల సంక్షేమానికి పాటుపడ్డారని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. శనివారం స్థానిక 13వ వార్డులోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో ఆజాద్ 135వ జయంతి వేడుకల సందర్భంగా ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ఖాదర్ మాట్లాడారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎంకేజీ మొయినుద్దీన్, జిల్లా ఆర్య వైశ్య మహిళా అధ్యక్షురాలు, వనితా గోల్డ్ క్లబ్ వైస్ గవర్నర్ యెండూరి సీతామహాలక్ష్మి క్లబ్ సభ్యులు సమకూర్చిన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కేఆర్ఎన్ ప్రసాద్, హుస్సేన్, ఎస్.పద్మావతి, ఆర్.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్‌కు ఘన నివాళి

తాళ్లరేవు: దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రచ్చ ముత్యాలు, చిట్టూరి చలపతి, రోళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాద్ జయంతి వేడుకలు

యానాం: స్వాతంత్య్ర భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖామంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రహదారిలోని అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి రీజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం అనంతరం ఆజాద్ దేశంలోని విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శేరు నూకరాజు, ఖండవల్లి రామకృష్ణ, పీఆర్ఏఓ కొల్లుప్రసాద్, చెక్కల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిపై ఇంటింటి సర్వే



ఎస్.పల్లిపాలెంలో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

అల్లవరం: ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ఎస్.పల్లిపాలెంలో సంక్షేమ పథకాల పనితీరుపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్పంచ్ కొల్లు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో మీకు, మీ కుటుంబానికి మంచి జరిగితే ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. సీఎం జగన్‌తోనే ఏపీ అభివృద్ధిని సాధిస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలన్నారు. కన్వీనర్లు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, గ్రామకమిటీ అధ్యక్షుడు నారాయుడు, లీలాప్రసాద్, సోమరాజు, గూంటూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



పిల్లంకలో జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరాజు

తాళ్లరేవు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అన్నారు. శనివారం పిల్లంక పంచాయతీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్రనేత చింతలపాటి శ్రీనివాసరాజులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ముఖ్యంగా అమ్మఒడి, రైతు భరోసా, నాడు–నేడు, ఇంటివద్దకే రేషన్, ఆసరా, చేయూత తదితర పథకాలను తీసుకురావడంతో పాటు ఆయా పథకాలను వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకే ఆయా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం పార్టీ జెండాను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, వైస్ ఎంపీపీ డి.నాగేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు మోర్త భీమాబాయి, గ్రామ కమిటీ కన్వీనర్ కె.కృష్ణంరాజు, నాయకులు కొపనాతి నాగరాజు, కోరుకొండ చంటి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేళ అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సుసరావు శ్రీధర్
- బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో తనిఖీలు



అమలాపురం మున్సిపల్ కాలనీలోని మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: దీపావళి సందర్భంగా మానవ తప్పిదాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ అన్నారు. అమలాపురం పట్టణం మున్సిపల్ కాలనీ, రూరల్ మండలం పేరూరులోని మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలను ఎస్పీ శ్రీధర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలో భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలతో కలిసి ఎస్పీ శ్రీధర్ ఆయా తయారీ కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి పలు భద్రతాపరమైన సూచనలు చేశారు. అనంతరం అమలాపురం బాలయోగి స్టేడియంలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాల సముదాయం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ ఏర్పాటుచేసిన అగ్నిమాపక అవుట్ పోస్టు, ముందు జాగ్రత్తతో ఉంచిన అగ్నిమాపక పరికరాలను ఎస్పీ పరిశీలించి దుకాణదారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు వారిని ఓ కంట కనిపెట్టుకోవాలన్నారు. బాణసంచా కాల్చే ప్రజలతో పాటు వాటిని తయారుచేసే కేంద్రాల నిర్వాహకులు, విక్రయించే దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు మనదే



కాట్రేనికోనలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కాట్రేనికోనలో పార్టీ కార్యకర్తలతో సమావేశం

కాట్రేనికోన: ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్ర ప్రజలు జగనన్నకు అండగా ఉన్నారని, విభేదాలకు పోకుండా కార్యకర్తలు, నాయకులు అంతా కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు మనదేనని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోన జెడ్పీహెచ్ పాఠశాల ప్రాంగణంలో మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో 33 సంక్షేమ పథకాల ద్వారా రూ.2,500 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఎన్నికలకు 100 రోజులు మాత్రమే గడువుందని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి జగనన్నకు తోడుగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ఉచిత విద్య, వైద్య సేవలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్ర ప్రజలకు ఎంతైనా ఉందన్నారు. దేశంలో జీడీఎస్‌పీ రేటింగ్‌లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టినందుకు, వ్యవసాయ రంగంలో 8.2 శాతం వృద్ధి సాధించినందుకు జగనే కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏడిది చక్రపాణిరావు, నడింపల్లి సూరిబాబు, సంసాని నాగేశ్వరరావు, ఏడిది సుబ్బు, మమ్మురాజు, పాలెపు ధర్మారావు, గంటి వెంకట సుధాకర్, నాతి సత్యనారాయణ, మల్లాడి వీరబాబ్జి, మల్లాడి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప కలశ పూజ




18వ సారి శబరిమల యాత్ర చేస్తున్న స్వాములను సత్కరిస్తున్న గురుస్వాములు

ముమ్మిడివరం శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్వామివారికి కలశ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వాములకు అన్నసమారాధన(బిక్ష) నిర్వహించారు. గురుస్వాములు పెన్మత్స జగ్గప్పరాజు, సీతారాముడు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వవన్‌శర్మ కలశ పూజను జరిపారు. అనంతరం అయ్యప్ప సేవా సంఘం వారి ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది 18వ సారి మాలధారణ చేసి శబరిమల యాత్ర చేస్తున్న మట్టపర్తి సురేష్‌స్వామి, చింతా శ్రీనివాస్ స్వామి, కట్టా కృష్ణస్వామి, కడలి ప్రసాద్ స్వాములను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సరిపెల్ల రామకృష్ణంరాజు, వి.చిన్నారావు, రామలింగేశ్వరరావు, రమణ, జార్జి పాల్గొన్నారు.

బాలాజీకి రూ.1.55 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.1.55 లక్షలు ఆదాయం వచ్చింది. స్వామివారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.10 లక్షలు వచ్చింది. నిత్యాన్నదానం ట్రస్ట్‌కు భక్తులు రూ.44,711 విరాళంగా అందించారు. స్వామిని 2,695 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,073 మంది స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.30 వేల ఆర్థిక సాయం



కొమరాడలో ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1980–81 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం మూడు పేద కుటుంబాలకు రూ.10 వేలు వంతున రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. కొమరాడ, కడలిలోని తూర్పుపాలెం, అమలాపురం సమీపాన ఇందుపల్లికి చెందిన ముగ్గురు నిరుపేద కుటుంబాలకు ఈ సహాయం అందించారు.

జగన్ మరోసారి సీఎం కావాలని యాత్ర

రావులపాలెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాపూరి జయకుమార్ 100 రోజుల ప్రజాచైతన్య యాత్రను చేపట్టారు. ఈ యాత్ర శనివారం రాత్రి రావులపాలెం చేరుకుంది. మండలంలోని గోపాలపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని కలసి జయకుమార్ యాత్ర విషయాలను తెలియజేశారు. నేటితో 60 రోజులు పూర్తయ్యాయన్నారు. ఇప్పటి వరకు 15 జిల్లాల్లో చైతన్యయాత్రను ముగించుకుని 16వ జిల్లాగా కోనసీమ జిల్లా చేరినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులను నుంచి క్యాబినెట్ పదవుల వరకూ సింహ భాగం జగనన్న పాలనలోనే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విజయఢంకా మోగిస్తుందని ఆకాంక్షించారు.

రౌడీషీటర్ హత్య కేసులో మరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్: మండలంలోని ఈదరపల్లిలో గత నెల 1వ తేదీన జరిగిన రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య, అడపా సాయిపై హత్యాయత్నం కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ శనివారం తెలిపారు. అమలాపురం పట్టణం కల్వకొలనువీధికి చెందిన సుంకర వీరవెంకట కరుణాకర్(బాబి)ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. బాబి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసులో బాబి అరెస్ట్‌తో ఇప్పటివరకూ 17 మందిని అరెస్ట్ చేశామని, మరికొంతమంది నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ హత్య, హత్యాయత్నం కేసు విషయంలో పట్టణ సీఐ టి.క్రాంతి కుమార్ లోతైన దర్యాప్తు చేస్తున్నారని డీఎస్పీ చెప్పారు. మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి చామంతిపూలతో పూజలు చేశారు. ఏడు వారాలు స్వామి వారిని దర్శించుకోవాలనే నమ్మకం నేపథ్యంలో భక్తులతో ఆలయం పోటెత్తింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.15 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి తణుకు పాలంకి వాస్తవ్యుడు కాలే సాయిశ్రీభావన శనివారం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతను శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చంద్రమోహన్ మృతి తీరని లోటు



నటుడు చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విలక్షణ నటుడు చంద్రమోహన్ మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కవి అరిగెల బలరామమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణలు పేర్కొన్నారు. అమలాపురం డాబా గార్డెన్స్‌లో శనివారం జరిగిన సంతాప సభలో చంద్రమోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి, కవి మాకే బాలార్జున సత్యనారాయణ, విశ్రాంత భవిష్య నిధి అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు, కోనసీమ మహిళా మండలి ప్రతినిధి పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

యుద్ధం వద్దు.. శాంతి ముద్దు..



అమలాపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అమలాపురం టౌన్: ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని కోరుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అమలాపురంలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పుర వీధుల్లో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అంటూ నినాదాలు చేశారు. భూపయ్య అగ్రహారం నుంచి హైస్కూలు సెంటరు వరకూ ర్యాలీ సాగింది. ర్యాలీలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పత్రి పూజ



స్వామివారికి లక్ష పత్రి పూజ చేస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: మాస శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వర స్వామి వారికి లక్ష పత్రి పూజ శనివారం ఘనంగా జరిగింది. ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి, అర్చకులు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన జరిపారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిత్య మాస పూజలకు దేవాదాయశాఖ అధికారిక వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగాభట్ల శ్రీరామ్ శర్మ, కిషోర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని అందుకున్న విద్యార్థి రాజు

తాళ్లరేవు: ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పటవల హైస్కూల్ విద్యార్థి దున్నా రాజు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం పొందినట్లు హెచ్ఎం సీహెచ్ కాశీవిశ్వనాథం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–19 విభాగంలో స్విమ్మింగ్‌లో రాజు జిల్లా స్థాయిలో సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. అక్కడా మెరుగైన ప్రతిభ చూపడంతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి రాజుతో పాటు అతడికి శిక్షణనిచ్చిన స్కూల్ పీడీ సుబ్రహ్మణ్యంలను హెచ్ఎం, స్కూల్ కమిటీ చైర్మన్ నరాల శ్రీను, కమిటీ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు అభినందించారు.